క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, సాయంత్రం పల్లకిసేవ గావించారు.

నేడు ముత్తుకూరుకు మంత్రి కాకాణి రాక

ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయ–సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం ఉదయం ముత్తుకూరుకు వస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధనరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మత్స్యశాఖ సమావేశ మందిరంలో జరిగే అసైన్‌మెంట్ భూముల పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని వెల్లడించారు.

నేడు కోవూరులో ఎమ్మెల్యే ప్రసన్న పర్యటన

కోవూరు : మండలంలోని పడుగుపాడు సచివాలయం –2 పరిధి చంద్రమౌళినగర్‌లో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి మంగళవారం తెలిపారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు.

చిన్నారులకు అన్నదానం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీలోని మూడో వార్డులో ఉన్న ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ చిన్నారులకు శ్రీకాంత్‌రెడ్డి, స్వాతి దంపతులు మంగళవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ ప్రత్యూష మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో చిన్నారులు, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షం

ఇందుకూరుపేట : మండల పరిధిలో మంగళవారం ఎడతెరిపి లేని వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. రహదారులు చిత్తడిగా మారాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచాయి. విద్యార్థులు, ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా వర్షం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

53.6 మి.మీ వర్షపాతం



తిక్కవరప్పాడు పంట పొలాల్లో జలకళ

వెంకటాచలం : మండల పరిధిలో రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు, రైతులు సంతోషిస్తున్నారు. సోమవారం రాత్రి నుంచి, మంగళవారం మధ్యాహ్నం వరకు వర్షం పడటంతో పంట పొలాలు జలకళను సంతరించుకున్నాయి. కాగా మంగళవారం నాటికి 53.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

తడిసిన తీర ప్రాంతం

తోటపల్లిగూడూరు : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని తీర ప్రాంతం పూర్తిగా తడిసింది. పలు లోతట్టు ప్రాంతాలు, రహదారులు నీటి ముంపునకు గురయ్యాయి. కోడూరు, వెంకన్నపాళెం తీర ప్రాంతాల్లో భారీ వర్షాలతో పాటు గాలులు వీస్తుండడంతో స్థానికులు వణికిపోయారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ ప్రత్యూష మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో సహాయ చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేశారు.

వ్యక్తిపై దాడి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ఓ వ్యక్తిపై దాడి జరిగిన ఘటనకు సంబంధించి మంగళవారం బుచ్చిరెడ్డిపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. మండలంలోని జొన్నవాడ గ్రామంలో నివాసం ఉంటున్న బెల్లంపల్లి కృష్ణకు పక్కనే నివాసం ఉంటున్న కందికట్టు కుమార్ కుటుంబంతో కొంత కాలంగా విబేధాలున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 17న కృష్ణ తన ఇంటి నుంచి టిఫిన్ షాపునకు వెళ్తుండగా కందికట్టు కుమార్ కుమారుడు మోహన్ ఉద్దేశపూర్వకంగా గొడవపెట్టుకున్నారు. తర్వాత కృష్ణ ఇంటికి వెళ్లిన కుమార్, అతని భార్య, ఇతర కుటుంబ సభ్యులను దుర్భాషలాడారు. కృష్ణ తలపై రాడ్డుతో గాయపరిచారు. దీంతో కృష్ణను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీకి తరలించారు. ఈ విషయమై కృష్ణ భార్య సురేఖ, తల్లి భవాని మంగళవారం బుచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహేంద్ర తెలిపారు.

జగనన్నతోనే జనరంజక పాలన సాధ్యం

- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల వెల్లడి



వెంకటాచలం : కసుమూరులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న పార్టీ నేతలు

వెంకటాచలం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే జనరంజక పాలన సాధ్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, జేసీఎస్ మండల కన్వీనర్ మందల వెంకటశేషయ్య పేర్కొన్నారు. మండలంలోని కసుమూరు గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని పలు కాలనీలు తిరిగి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రతి కుటుంబంలో ఏ పథకం ద్వారా ఎంత లబ్ధిపొందారో ప్రజల ద్వారానే చెప్పించారు. అనంతరం వెంకటశేషయ్య విలేకరులతో మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని కొనియాడారు. ప్రజా సంకల్పయాత్రలో ప్రజలకిచ్చిన వాగ్దానాలనే కాకుండా, ఇవ్వని వాగ్దానాలను కూడా అమలు చేశారని తెలియజేశారు. గత చంద్రబాబు పాలనలో ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలి ఇష్టారాజ్యంగా దోపిడీకి పాల్పడ్డారని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అన్నిరకాలుగా మేలు జరగాలంటే జగనన్న పాలనతోనే సాధ్యమవుతుందని, ఈవిషయాన్ని ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొణిదెన మోహన్‌నాయుడు, సర్పంచ్ కడివేటి శివ, ఉప సర్పంచ్ బాబర్, వైఎస్సార్‌సీపీ నాయకులు చీకుర్తి నరసయ్య, కాకర్ల నాగేశ్వరరావు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ముత్తుకూరు : పిడతాపోలూరు సచివాలయంలో..

పొదలకూరు : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజాప్రతినిధులతో పాటు వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని ఆర్‌వైపాళెం సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం వెలుపల సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించి, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలు అందని వారికి ఎందుకు అందడం లేదో తెలుసుకున్నారు. సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందకుంటే వెంటనే వలంటీర్ల ద్వారా సరిదిద్దుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, సర్పంచ్ దేవరపాటి పెంచలమ్మ, పార్టీ నేతలు బూసిపల్లి చిన్నపరెడ్డి, సచివాలయ కన్వీనర్లు గజ్జెల పెంచలకృష్ణారెడ్డి, కాసరం రామిరెడ్డి, గుంజి నిర్మల తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు : కొత్తవంగల్లులో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ

రికార్డు స్థాయిలో సంక్షేమ పథకాలు

ముత్తుకూరు : దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో రికార్డు స్థాయిలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ఎంపీపీ గండవరం సుగుణ, మండల సచివాలయ కన్వీనర్ నెల్లూరు శివప్రసాద్ అన్నారు. మండలంలోని పిడతాపోలూరు సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం మంగళవారం జరిగింది. తొలుత సంక్షేమ పథకాలు–లబ్ధిదారుల వివరాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారును మళ్లీ ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, సర్పంచ్ రాజకుమారి, పార్టీ నేతలు కోటారెడ్డి, రమణయ్య, ఎంపీడీఓ లక్ష్మణకుమార్, పంచాయతీ కార్యదర్శి గిరి తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట : జగదేవిపేటలో..

సుపరిపాలనకు జగనన్న సీఎం కావాలి

కొడవలూరు : రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ నేతలు పిలుపునిచ్చారు. మండలంలోని కొత్తవంగల్లులో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. రాష్ట్రంలో వివిధ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారులకు నగదు అందించడం గతంలో ఎప్పుడూ లేదన్నారు. గత ప్రభుత్వంలో ఏ పథకం పొందాలన్నా నేతల సిఫార్సు కావల్సి వచ్చేదన్నారు. రాష్ట్రంలో అందరూ సుఖసంతోషాలతో ఉన్నారని, ఇదే పరిస్థితి కొనసాగాలంటే మనమంతా జగనన్నను మరలా ఆశీర్వదించాలని కోరారు. అనంతరం గ్రామంలో జరిగిన రూ.23.40 కోట్ల సంక్షేమ లబ్ధిని డిజిటల్ బోర్డుపై ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత చక్కా మనోహర్‌బాబు, సర్పంచ్‌లు ఆమవరపు సింధు, బెజవాడ లక్ష్మీబాయి, ఎంపీటీసీ నంబూరి ప్రసాద్, ఉప సర్పంచ్ శైలజ, పార్టీ నేతలు వేముల వెంకటేశ్వర్లు, సీహెచ్.శ్రీనివాసులురెడ్డి, కొనిజేటి శేషగిరిరావు, వి.నవీన్, ప్రేమ్‌కుమార్, హరిబాబు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ఇసకపాళెం సచివాలయం-3లో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీకి శ్రీరామరక్ష అని బుచ్చి రూరల్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇసకపాళెం-3 సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ పథకాల చార్టు ఆవిష్కరించారు. గ్రామంలో పర్యటించి ప్రజలకు ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. అనంతరం సతీష్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేకూరాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నేపల్లి శ్రీనివాసులు, పార్టీ నేతలు కోడూరు మధుసూదన్‌రెడ్డి, వినోద్, ప్రదీప్, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పాలన జగనన్నతోనే సాధ్యం



కోవూరు : పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

కోవూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమని డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. మండలంలోని పడుగుపాడు సచివాలయం–1లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ప్రదర్శించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్ రెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ అహ్మద్ పాల్గొన్నారు.

పేదల పక్షపాతి వైఎస్ జగన్

ఇందుకూరుపేట : పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్ అని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని జగదేవిపేటలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులు రెడ్డితో కలిసి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విజయ్‌కుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని కోరారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బీవీ రమణయ్య, పార్టీ నేతలు సునీల్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

- రక్తహీనత సమస్యల గుర్తింపు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కొడవలూరు : కొడవలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులకు స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించి నలుగురు చిన్నారులకు రక్తహీనత ఉన్నట్లు గుర్తించి మందులు అందజేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.రామకృష్ణ, జి.బాలచంద్రబాబు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతినెలా క్రమం తప్పకుండా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య సమస్యలను గుర్తించి చికిత్స అందిస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ టి.సోమశేఖర్, హెచ్‌ఎస్ వి.రామ్మోహన్, హెచ్‌ఏ షఫీఉద్దీన్ ఏఎన్‌ఎం శేషుబాయి, ఎల్టీ గ్రేస్ మేరీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటిని పొదుపుగా వాడాలి



మనుబోలు : రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

మనుబోలు : రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని మండల వ్యవసాయాధికారి షేక్.జహీర్ రైతులకు సూచించారు. మండలంలోని లక్ష్మీనరసింహాపురం, కాగితాలపూరు, పిడూరు గ్రామాల్లో నీటి యాజమాన్యంపై ఆయన మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో డ్యామ్‌లలో నీరు తక్కువగా ఉందన్నారు. మనుబోలు మండలానికి విడతల వారీగా 2 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నందున ప్రస్తుత సీజన్‌లో వరి పంటకు ఎటువంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. వరి నాట్ల సమయంలో రైతులు తమ పొలంలో 2 సెంటీమీటర్ల నీరు ఉండేలా చూసుకుంటే సరిపోతుందన్నారు. పిలకలు కట్టే సమయంలో 4 నుంచి 5 సెంటీమీటర్లు, చిరుపొట్ట దశ నుంచి కోత వరకూ 2 సెంటీ మీటర్లు నీరు పెట్టుకుంటే సరిపోతుందని తెలిపారు. ఆర్‌ఎస్‌ఆర్ విత్తనాల కోసం ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకుంటే సరఫరా చేస్తామన్నారు. ఆయన వెంట ఏఏఓ కళారాణి, వీఏఏలు అమూల్య, తేజస్వి ఉన్నారు.

స్వల్పకాలిక వరి వంగడాలతో లాభం

విడవలూరు : రైతులు స్వల్పకాలిక వరి వంగడాలను వేసుకోవాలని మండల ఏఓ కృష్ణయ్య అన్నారు. ఇందులో భాగంగా ఆయన వావిళ్ల, దంపూరు, గాదెలదిన్నె గ్రామాల్లోని రైతులతో మంగళవారం మాట్లాడుతూ స్వల్పకాలిక వంగడాలతో రైతులకు పంట త్వరగా చేతికి వచ్చి లాభాల బారిన పడుతారన్నారు. వ్యవసాయ విస్తరణాధికారి జి.కిరణ్, లక్ష్మి, వీఆర్వో శ్రీనివాసులు, సెక్రటరీ శ్రీలత పాల్గొన్నారు.

స్వల్పకాలిక రకాలపై అవగాహన

ముత్తుకూరు : సోమశిల జలాశయం నుంచి సాగునీరు విడుదలైన నేపథ్యంలో రైతులు స్వల్పకాలిక రకం వరివిత్తనాల సాగుపై అవగాహన కలిగి ఉండాలని ఏఓ జ్యోత్స్నరాణి అన్నారు. మండలంలోని పంటపాళెం, దొరువులపాళెం ఆర్బీకేల్లో మంగళవారం జరిగిన రైతుల సమావేశంలో ఆమె ప్రసంగించారు. స్వల్పకాలిక రకాలైన ఆర్‌ఎన్‌ఆర్–15048, ఎన్‌ఎల్‌ఆర్–34440, ఎన్‌ఎల్‌ఆర్–3354 రకాలను వేసుకోవాలని సూచించారు. డిసెంబరు 15వ తేదీలోగా నాట్లు వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాగునీటి వినియోగంలో మెళకువలు పాటించాలని కోరారు. సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు పాల్గొన్నారు.

చిన్నారుల రక్షణకు ప్రత్యేక డ్రైవ్



ఇందుకూరుపేటలో తనిఖీలు చేస్తున్న సహాయ కమిషనర్ గౌస్‌బాషా

ఇందుకూరుపేట : చిన్నారులు పనిలో లేకుండా ఉండేలా కార్మిక శాఖ సహాయ కమిషనర్ గౌస్‌బాషా ఆధ్వర్యంలో మండల పరిధిలో మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్‌రైట్స్‌లో భాగంగా ఈనెల 20 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా పరిశ్రమలు, షాపులను తనిఖీలు చేసి బాలకార్మికులు ఉంటే చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ మెంబర్ హరిబాబు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం

కోవూరు : కోవూరులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు వెయిట్ లిఫ్టింగ్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం లింగంపల్లి నరసింహమూర్తి తెలిపారు. పాఠశాల ఆవరణలో జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థినులను ఆయన మంగళవారం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అండర్–19, అండర్–17 జట్టుకు మా పాఠశాల నుంచి 15 మంది బాలికలు ఎంపికవడం సంతోషకరమన్నారు. ఇందుకు కృషి చేసిన పాఠశాల పీడీ దేవిక, పీఈటీ వెంకట సుబ్బమ్మలను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు.

ఎమ్మెల్యే ప్రసన్న చేయూత



చిన్నారులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

విడవలూరు : తండ్రి చనిపోయిన పిల్లలకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేయూత అందించారు. మండలంలోని రామతీర్థం గ్రామంలో మాద పావని, మాద రామకృష్ణ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రసన్న తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇద్దరికి రూ.20 వేలు చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ పత్రాలను ఎమ్మెల్యే మంగళవారం అందజేశారు

ధర్మప్రచార వారోత్సవాలు వాయిదా

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నేటి నుంచి జరగాల్సిన ధర్మప్రచార వారోత్సవాలను వాయిదా వేశామని కామాక్షితాయి ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు మంగళవారం తెలిపారు. కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో తలపెట్టిన ధర్మ ప్రచార వారోత్సవాలు భారీ వర్షాల నేపథ్యంలో వాయిదా వేశామన్నారు. తదుపరి తేదీలను త్వరలో ప్రకటిస్తామని వివరించారు.

కులగణనపై అపోహలొద్దు

మనుబోలు : కులగణనపై అపోహలు వీడాలని ఎంపీడీఓ ప్రసాద్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కులగణనపై శిక్షణ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు కులగణన చేపడుతున్నట్లు తెలిపారు. కులగణనకు ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఎటువంటి సంబంధం ఉండదన్నారు. ప్రత్యేకంగా తయారు చేసిన యాప్‌లో 34 అంశాల ఆధారంగా వివరాలు సేకరించి నమోదు చేస్తారని తెలిపారు. అనంతరం డీఆర్పీ హరేందర్‌రెడ్డి సర్వే ఎలా చేయాలనే విషయంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ రవికుమార్ రెడ్డి, ఏపీఎం వనజాక్షి పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

వెంకటాచలం : విక్రమసింహపురి యూనివర్సిటీ విద్యార్థులు ఆర్.పావని, కె.వెంకయ్య డాక్టరేట్ అందుకున్నట్లు వీఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బయో టెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎస్వీ సాయినాథ్ ఆధ్వర్యంలో ఆర్.పావని, కె.వెంకయ్య వేర్వేరుగా పరిశోధన గ్రంథాలను సమర్పించారని, దీంతో వీరిద్దరికీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలియజేశారు.

రైతుల ఖాతాల్లో నేరుగా పరిహారం

- ఆర్డీఓ మలోల



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

మనుబోలు : బద్వేలు–నెల్లూరు హైవే నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం నగదు నేరుగా వారి ఖాతాల్లోకి జమ అవుతుందని నెల్లూరు ఆర్డీఓ మలోల తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సేకరించిన భూములకు సంబంధించిన మంగళవారం ఆయన రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. అనంతరం వెలుగు కార్యాలయంలో భూములు కోల్పోయిన మండల రైతులతో సమావేశమై పరిహారంపై అవగాహన కల్పించారు. మండలంలోని వడ్లపూడి, చెరుకుమూడి, గురివిందపూడి గ్రామాల్లోని 67.61 ఎకరాల భూములను హైవే కోసం సేకరించినట్లు తెలిపారు. ఇందులో వడ్లపూడి రెవెన్యూ పరిధిలో 7.10 ఎకరాలు, చెరుకుమూడి పరిధిలో 47.38 ఎకరాల ప్రైవేటు భూములు తీసుకోగా గురివిందపూడిలో కేవలం 8 సెంట్ల భూమి మాత్రమే తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి 58 మంది రైతులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. ఈ భూముల్లో పండ్ల తోటలు, పెద్ద చెట్లు, బావులు ఉన్న చోట్ల అంచనాలకు రెండున్నర రెట్ల పరిహారం అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట డీటీ శ్రీకాంత్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

'60 శరత్తులు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

వెంకటాచలం : మండలంలోని సరస్వతీనగర్ వద్ద నున్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ రచించిన '60 శరత్తులు' పుస్తకాన్ని తెలుగు కవి డాక్టర్ పెరుగు రామకృష్ణ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధత కలిగిన కవిగా మాడభూషి సంపత్‌కుమార్‌కు పేరుందని, తన అనుభవంలోకి వచ్చిన ప్రతి విషయాన్ని కవిత్వంగా మలిచే సామర్థ్యం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. జాతీయ పరీక్ష కేంద్రం రిసోర్స్ పర్సన్ డాక్టర్ ఎం.నారాయణరెడ్డి, తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ఝాన్సీవాణి, డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య ఈ పుస్తకంలోని అంశాలను వివరించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

ఇందుకూరుపేట : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి షేక్ ఖాదర్‌వలి అన్నారు. మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం క్షేత్రస్థాయిలో లెప్రసీ, ఎయిడ్స్ బాధితులను పరిశీలించి, ప్రభుత్వం అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. బాధితులు సకాలంలో మందులు వాడేలా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు వహించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారుల బృందం శ్రావణ్‌కుమార్, నరసింహులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



మనుబోలు : ప్రతిఒక్కరం కలిసికట్టుగా బాల్య వివాహాలను అరికడదామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు రమణమ్మ, ఆదినారాయణమ్మ పిలుపునిచ్చారు. మనుబోలు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాలికలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు 11 మందితో కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీలో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, పాఠశాల హెచ్‌ఎం, పొదుపు గ్రూపు సభ్యుడు, మహిళా వార్డ్ మెంబర్, ఏఎన్‌ఎం, స్వచ్ఛంద సంస్థ సభ్యుడు, యువ సమాఖ్య సభ్యుడు, అంగన్‌వాడీ కార్యకర్త, మహిళా పోలీస్ సభ్యులుగా ఉంటారని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా ఆడపిల్లలకు 18, మగ పిల్లలకు 21 సంవత్సరాల్లోపు వివాహాలు చేస్తుంటే ఈ కమిటీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో నాగార్జునరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రావణి, మహిళా పోలీస్ శ్రావ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.